




# కరపత్రం

SINCE 2014

శనివారం సెప్టెంబర్ 13 2025 | సంపుటి :0 | సంచిక :327 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

**రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించిన ద్రౌపది ముర్ము**

**హాజరైన ప్రధాని మోడీ, పలువురు ప్రముఖులు**





భారత నూతన ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీతోపాటు–, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఏపీ డిప్యూటీ–సీఎం పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. మాజీ రాష్ట్రపతులు, మాజీ ప్రధానులు, మాజీ ఉప రాష్ట్రపతులనూ ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతులు జగదీప్ ధన్‌ఖడ్, వెంకయ్యనాయుడు, హమీద్ అన్సారీ తదితరులు కూడా హాజరయ్యారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, పియూష్ గోయెల్, ధర్మేంద్ర ప్రదాన్ సహా పలువురు కేంద్ర మంత్రులు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఎన్డీయే కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఈనెల 9న జరిగిన పోలింగ్‌లో ఎన్డీయే కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై 152 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఎన్నిక లాంఛనాలన్నీ పూర్తి కావడంతో గురువారం మహారాష్ట్ర గవర్నర్ పదవికి సీపీ రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. దీంతో మహారాష్ట్ర బాధ్యతలను గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు రాష్ట్రపతి ముర్ము అప్పగించారు. ఆర్ఎస్ఎస్, జన్‌సంఘ్ లాంటి సంస్థలతో 16 ఏండ్లకే రాధాకృష్ణన్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 1996లో తమిళనాడు బీజేపీ కార్యదర్శిగా, 2003 నుంచి 2006 మధ్య అధ్యక్షుడిగా పనిచేశారు.

పేజి 2లో ▶

# తెలంగాణలో పలు జిల్లాలకు అతి భారీ వర్షసూచన



హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే వీలుందని తెలిపింది. ఆదివారం మరికొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసింది. శనివారం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. వర్షాల ప్రభావంతో గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే వీలుందని తెలిపింది.

## యాకుత్‌పురా ఘటనకు బాధ్యులైన హైడ్రా సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం: రంగనాథ్



హైదరాబాద్: నిన్న ఉదయం యాకుత్‌పురాలో ఐదేళ్ల బాలిక పాఠశాలకు వెళ్తూ ప్రమాదవశాత్తూ మ్యాన్ హోల్‌లో పడిపోయింది. వెంటనే గమనించిన బాలిక నాయనమ్మ, స్థానికులు సురక్షితంగా కాపాడారు. హైడ్రా సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ఘటనపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు.

పేజి 2లో ▶

## కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ సభ వాయిదా




హైదరాబాద్: కామారెడ్డిలో సెప్టెంబర్ 15న కాంగ్రెస్ నిర్వహించ తలపెట్టిన బీసీ డిక్లరేషన్ సభ వాయిదా పడింది. ఈ మేరకు టీపీసీసీ అధికారికంగా ప్రకటించింది.

పేజి 2లో ▶

## బొగ్గు బ్లాక్‌లు దక్కకపోవడంతో సింగరేణి ఇబ్బందులు ఎదుర్కొంటోంది




- సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే కాకుండా ఇతర ఖనిజాల వైపు కూడా అడుగులు వేస్తోంది.
- సింగరేణి సంస్థకు అదనంగా బొగ్గు బ్లాక్‌లు కేటాయించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటుంది.
- కర్ణాటకలోని రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్‌లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో సింగరేణి పాల్గొంది.
- రాగి, బంగారం మైనింగ్ చేసే ఏ సంస్థ అయినా సింగరేణికి 37.75 శాతం రాయల్టీ చెల్లిస్తుంది.

2లో..




## పరీక్షల సన్నద్ధతలో ఉండండి..

**త్వరలోనే జాబ్ క్యాలెండర్: నిరుద్యోగులకు మంత్రి పొన్నం కీలక సూచన**



- నిరుద్యోగులు ఆందోళన చెందొద్దని, త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల అవుతుందని తెలిపారు.
- జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు వేగంగా పూర్తి చేస్తామని, నిరుద్యోగులు పరీక్షలకు సిద్ధంగా ఉండాలని సూచించారు.
- అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దాదాపు 65 వేల ఉద్యోగాలు ఇచ్చామని, గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను కూడా పరిష్కరించామని పేర్కొన్నారు.
- గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో ఉన్న లోపాలపై కోర్టు ఇచ్చిన తీర్పును అందరూ స్వాగతించాలని అన్నారు.

2 లో




- ప్రధాన ఆలయాల వద్ద శాశ్వాత ఘాట్స్ నిర్మించాలి
- ఒకే సారి 2 లక్షల మంది స్నానం చేసే వీలుండాలె
- స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఘాట్స్ డిజైన్ చేయండి
- టూరిజం, ఇరిగేషన్, ఎండోమెంట్ కోఆర్డినేట్ చేసుకోవాలె

## గోదావరి పుష్కరాలపై సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: గోదావరి పుష్కరాల నేపథ్యంలో బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రధాన ఆలయాల వద్ద శాశ్వత ఘాట్స్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒకే సారి రెండు లక్షల మంది స్నానాలు చేసేందుకు వీలుగా ఘాట్లు ఉండాలని సూచించారు. ఇవాళ కమాండ్ కంట్రోల్ సెంటర్?లో 2026లో వచ్చే గోదావరి పుష్కరాలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలంతో పాటు ఇతర ఆలయాల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారుల సమీపంలో ఉన్న గోదావరి పరీవాహక ఆలయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న ఘాట్స్?ను విస్తరించడంతో పాటు రోడ్లు, ఇతర సౌకర్యాలను శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

పేజి 2లో ▶

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 13 2025

# సంపాదకీయం

## అమెరికా... అమెరికా.. ఎక్కడ నుంచి ఎక్కడకు

ప్రాభవం కోల్పోతున్నప్పుడు, దానికి విరుగుడుగా ప్రత్యామ్నాయ మార్గమూ దొరకనప్పుడు విపరీత ప్రవర్తన కనపడుతుంది. వ్యక్తికైనా దేశానికైనా ఇదే వర్తిస్తుంది. ప్రపంచ దేశాల మీద ఎడాపెడా సుంకాలు విధిస్తూ అల్లకల్లోలం సృష్టిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనల్డ్ ట్రంప్ చర్యల్లో మనకు కనపడేది ఇదే. ఆధిపత్యానికి కావాల్సిన హంగులు, ఏర్పాట్లు, మేధో విశిష్టతలు ఒక్కొక్కటిగా కోల్పోతున్నప్పుడు మర్యాదలూ, సంయమనాలూ మట్టికల్సిపోతాయి. దౌత్యనీతులు మంటగలుస్తాయి. చుట్టూ శత్రు సమూహాలు కమ్ముకొస్తున్నట్టుగా హడావుడులు హెూరెత్తుతాయి. పైపైన చూస్తే ట్రంప్ లాంటి నాయకులు తమ ప్రవర్తనతో, లోతులేని ఆలోచనలతో కోరికోరి అమెరికాకు నష్టాలు తెచ్చిపెడుతున్నట్లుగా కనిపిస్తుంది. వ్యక్తుల ప్రవర్తన, వ్యక్తిత్వమే అన్నిటికీ కీలకం అనుకుంటే అసలు పరిస్థితులు అర్థంకావు. నాయకుల ప్రభావం చరిత్రగతి మీద ఉంటుంది. దాన్ని కాదనలేం. కానీ ఒక సమాజం, ఒక దేశం సంక్లిష్ట ప్రయాణాన్నీ, ఆటుపోట్లనూ అర్థం చేసుకోటానికి ఎన్నో పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుంది. నిజానికి ఆ పరిస్థితుల్లో నుంచే విపరీత పోకడల నేతలు పుట్టుకొస్తారు.

వాణిజ్య సుంకాలను అస్త్రాలుగా ఉపయోగించి, వివిధ దేశాల ఎగుమతులపై అనిశ్చితిని సృష్టించి, అమెరికాకు నచ్చినట్లు ఆయా దేశాల ఆర్థిక వ్యవహారాలను మార్చటానికి ట్రంప్ చేస్తున్న ప్రయత్నాలను సునిశితంగా పరిశీలిస్తే ఒక సంక్షోభమే కనపడుతుంది. ఆధిపత్యం కోల్పోతున్న క్రమం వెల్లడవుతుంది. ఎగుమతులు తగ్గి దిగుమతులు విపరీతంగా పెరగటం అమెరికాకు నిన్నోమొన్నో మొదలవ్వలేదు. దిగుమతుల కంటే ఎగుమతులు ఎక్కువ ఉంటే ఏ దేశమైనా వాణిజ్యపరంగా మిగులును (ట్రేడ్ సర్ఫలస్) కలిగి ఉంటుంది. అమెరికా ఆ స్థానాన్ని ఎప్పుడో కోల్పోయింది. 1976 నుంచి ఇప్పటివరకూ ఏ ఏడాదిలోనూ వాణిజ్య మిగులును సాధించలేదు. రకరకాల వస్తువులు, పరికరాలు, పదార్థాలు, యంత్రాల కోసం విదేశాలపై ఆధారపడటం 50 ఏళ్లుగా కొనసాగుతోంది. ముడిసరుకులు, శ్రమశక్తి చవకగా ఉన్న దేశాల నుంచి ఎగుమతులను ప్రోత్సహించటం ఒకనాడు విధానంగా పెట్టుకుంది. అక్కడికి పెట్టుబడులనూ తరలించింది. అటువంటి దేశాలను అన్ని విధాలా వెన్నుతట్టింది. తనకు చౌకగా వస్తువులను ఎగుమతి చేసే దేశాలను స్వేచ్ఛా వాణిజ్యానికి అసలుసిసలైన ప్రతినిధులుగా కీర్తించింది. ప్రపంచీకరణ బాగా ఊపందుకున్న 1990ల తర్వాత బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, ఐటీ ఆధారిత, విమాన ప్రయాణం, పర్యాటక, విద్యా, మేధోహక్కుల రంగాలకు సంబంధించిన వాణిజ్యసేవల లావాదేవీల్లో అమెరికా మిగులును సాధిస్తూ వస్తున్నా, వస్తూత్పత్తి రంగాల్లో వెనుకబడి పోయింది. కిందటి ఏడాదిలో వస్తూత్పత్తి లావాదేవీల్లో 1.21 ట్రిలియన్ డాలర్ల లోటు ఉంది. సర్వీసు రంగాల్లో వచ్చిన మిగులు 293 బిలియన్ డాలర్లు ఉన్నప్పటికీ మొత్తంగా చూస్తే దాదాపు 918 బిలియన్ డాలర్ల లోటు ఏర్పడింది. ఇదొక విపత్కర పరిస్థితి. అగ్రగామి దేశానికి వాణిజ్య మిగులు ఉండటం సహజం.

మొదటి ప్రపంచ యుద్ధం వచ్చేవరకూ దాదాపు వందేళ్లపాటు వాణిజ్యంలో బ్రిటన్ మిగులును సాధించింది. ఆ తర్వాత దాన్ని కోల్పోయింది. దాంతో ప్రపంచంలో ఒకటో స్థానాన్నీ కోల్పోయింది. ఆ తర్వాత ఆర్థికపరంగా చాలా మెట్లు దిగాల్సి వచ్చింది. వస్తు, యంత్ర ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్నంతవరకూ బ్రిటన్ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. అమెరికా కూడా ఒకప్పుడు ఆ రకంగానే తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. 1980ల తర్వాత ఆసియా దేశాలు బాగా ముందంజ వేస్తున్న పరిస్థితుల్లో ఆ స్థానాన్ని అమెరికా తిరిగిపొందే అవకాశం కనపడటంలేదు. మాగా, మాగా (మేక్ అమెరికా గ్రేట్ అగెన్) అనే నినాదంపై ఎంతగా గొంతెత్తినా ఆశించిన ఫలితాన్ని సాధించటం అంత తేలికకాదు. స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని ఆపిల్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్ లాంటి బడా టెక్ కంపెనీలపై విపరీత ఒత్తిళ్లు వస్తున్నా అవి ఎంతమేరకు నెరవేరతాయో ఇప్పుడే చెప్పలేం. రాజకీయ పరిస్థితులు మారిపోతే ఆ ఒత్తిళ్లూ తగ్గుతాయి. లాభాలు, ఇతరత్రా ఉండే సానుకూలతలకే కంపెనీలు ప్రాధాన్యం ఇస్తాయి. వాటి ముందు దేశభక్తి నిలబడటం కష్టం!

అమెరికాతో పోల్చితే చైనా ట్రిలియన్ డాలర్ల మిగులు వాణిజ్యంలో ఉండటానికి కారణం వస్తూత్పత్తిలోనూ, శాస్త్రసాంకేతిక రంగాల్లో సాధించిన అనూహ్య అభివృద్ధే. ఆధునిక చరిత్రలోనే ఇది అపూర్వం. గ్లోబలైజేషన్ గురించి ఎన్నో పొగడ్తలతోనూ, పోటీ పునాదిగా ఆర్థిక వ్యవస్థలు మారటానికి అదెలా కారణమవుతుందో వివరిస్తూ ప్రముఖ వ్యాఖ్యాత థామస్ ఫ్రీడ్‌మన్ 2005లో 'ద వల్డ్ ఈజ్ ఫ్లాట్' పుస్తకాన్ని రాశారు. ఆన్‌లైన్ ట్రేడింగ్, ఐటీ ఆధారిత సర్వీసులు ప్రపంచాన్ని ఎట్లా మార్చి వేయబోతున్నాయో అప్పుడే చెప్పారు. ప్రపంచీకరణతో అన్ని దేశాలకూ సమాన అవకాశాలు దక్కుతాయని చెప్పటమే కాకుండా అందుకు ఉదాహరణలుగా బెంగళూరులో ఐటీ కంపెనీల గురించి ఘనంగా వివరించారు. అసలు 'వల్డ్ ఈజ్ ఫ్లాట్' అన్న భావననే తాను ఇన్ఫోసిస్ ఛీఫ్‌గా ఉన్న నందన్ నిలేకని నుంచి స్వీకరించానని కూడా తెలిపారు. ఫ్రీడ్‌మన్ ఒక విషయాన్ని ఆనాడు చాలా స్పష్టంగా చెప్పారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమ్యాటిక్స్ (స్టెమ్) కోర్సుల్లో అమెరికన్ విద్యార్థుల సంఖ్య తగ్గిపోవటం ప్రమాదకరంగా మారుతోందనీ దాన్ని అరికట్టకపోతే తీవ్ర ప్రమాదం పొంచివుందనీ హెచ్చరించారు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన విద్యా సంస్థల్లోని స్టెమ్ కోర్సులో ఆసియా విద్యార్థుల ఆధిపత్యం పెరిగిపోతోందనీ, అది అలాగే కొనసాగితే కొత్త టెక్నాలజీలకు అమెరికా నాయకత్వం వహించే పరిస్థితి ఉండదనీ చెప్పారు. 2005 నాటికే చైనా, జపాన్‌ల్లో అమెరికా కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా స్టెమ్ సబ్జెక్టుల్లో చదివే విద్యార్థులు ఉన్నారు. తాజా లెక్కల ప్రకారం ఈ ఏడాదిలో చైనాలో స్టెమ్ కోర్సుల్లో పీహెచ్‌డీ పూర్తిచేసే పరిశోధక విద్యార్థులు 77,000 మంది ఉంటే అమెరికాలో ఆ సంఖ్య 40,000 మాత్రమే. ఇందులోనూ ఆసియా విద్యార్థుల సంఖ్య గణనీయంగానే ఉంటుంది. వీసాల ఆంక్షలతో, సవాలక్ష శల్యపరీక్షలతో ఆసియా పరిశోధకులకు అడ్డంకులు సృష్టిస్తే స్టెమ్ కోర్సుల్లో చేరే ప్రతిభావంతుల సంఖ్య ఇంకా తగ్గుతుంది. పరిశోధన%–%అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కోసం ఖర్చుపెట్టే నిధుల విషయంలో కూడా చైనా అమెరికాను ఈ ఏడాది దాటేయబోతోంది. అమెరికా ఆధిపత్యానికి గండిపడటానికి ఇవన్నీ గట్టి సూచికలు.సుంకాల యుద్ధంలో తాను ఇప్పటికే విజయం సాధించాననే భావనతోనే ట్రంప్ ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 11 నెలల కాలానికి దిగుమతి సుంకాల ద్వారా 183.6 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చింది. 2024లో వచ్చిన 77 బిలియన్లతో పోల్చుకుంటే ఇది చాలా ఎక్కువ. 2023 నాటి 93 బిలియన్ డాలర్లతో పోల్చినా దాదాపు రెట్టింపు అయినట్లు లెక్క. అయినా అమెరికాను విపరీతంగా కుంగదీస్తోన్న బడ్జెట్ లోటును అది ఆర్చేది తీర్చేది కాదు. ఆ లోటును పూడ్చటానికి అదనపు సుంకాల విధింపును సాధనంగా ఎంచుకున్నా దక్కే ఫలితం మాత్రం కొంతే. 1900 బిలియన్ డాలర్ల బడ్జెట్ లోటులో (2025 అంచనాలు) సుంకాల ద్వారా లభించే మొత్తం ఆదాయం 10 శాతానికి కాస్త అటూఇటూగానే ఉంటుంది. లోటుని పూడ్చటానికి సుంకాలు పెంపు పరిష్కారం కాదనేది ఈ అంకెలే చెబుతాయి. దిగుమతి సుంకాల పెంపు ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేసే ప్రమాదం ఉందని రేటింగ్ సంస్థలు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నా ట్రంప్ బృందం పట్టించుకోవటంలేదు.ఒకప్పుడు అభివృద్ధి చెందుతోన్న దేశాలు తమ దుస్థితికి పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ధనిక దేశాలే కారణమని విమర్శించేవి.

## ఆనాడు మీ నాయన చేసిన పనేంది.. అప్పుడు మీకు సిగ్గు లేదా..? కేటీఆర్?పై మంత్రి జూపల్లి ఫైర్

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సిగ్గుందా అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఫైర్ అయ్యారు. శుక్రవారం (సెప్టెంబర్ 12) ఆయన గాంధీభవన్?లో మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేలను సిగ్గుందా అని కేటీఆర్ మాట్లాడటం తగదన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆనాడు మీ నాయన కేసీఆర్ చేసిన పనేంది..? మీరు ఆనాడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదా..? ఆనాడు మీరు పక్క పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు మీకు సిగ్గులేదా అని కౌంటర్ ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు వేల కోట్లు దోచుకుని ఇప్పుడు సిగ్గుందా అని మాట్లాడటం విడ్డూరం అన్నారు.

కేటీఆర్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు విషయంలో ఏదున్నా స్పీకర్ చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని తాను అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు తన వ్యాఖ్యలను వక్రీకరించారని మంత్రి జూపల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## యాకుత్‌పురా ఘటనకు బాధ్యులైన హైడ్రా సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం: రంగనాథ్

మొదటిపేజీ తరువాయి

హైడ్రా వల్లే తప్పు జరిగిందని గుర్తించామని, ఘటనకు బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

"నగరంలో ఉన్న మ్యాన్‌హెూల్స్‌పై ఆడిట్ చేస్తున్నాం. మూతలు సరిగాలేనివి గుర్తించి.. సంబంధిత ఏజెన్సీకి సెక్రటరీ ద్వారా రిఫర్ చేస్తాం. జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, హైడ్రా మధ్య ఎలాంటి సమన్వయ లోపం లేదు. బ్లేమ్ గేమ్ కాకుండా సమన్వయంతో ముందుకెళ్లాలి. యాకుత్‌పురా ఘటనపై రాజకీయపరంగా చేసే విమర్శలపై స్పందించను. భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటాం. మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ ఇన్‌ఛార్జి నిన్న జరిగిన ఘటనకు బాధ్యుడు.. అతనిపై చర్యలు తీసుకుంటాం. ఆ చుట్టుపక్కల నాలుగైదు మ్యాన్ హెూల్స్ ఉన్నాయి.. అందులో ఒకటి వాటర్ బోర్డు వాళ్లు క్లీన్ చేశారు. ఘటన జరిగిన మ్యాన్ హెూల్ మాత్రం హైడ్రా సిబ్బంది క్లీన్ చేశారు. మంచి చేస్తేనే మా ఖాతాలో వేసుకోవడం కాదు.. తప్పు జరిగినప్పుడు కూడా అంగీకరిస్తున్నాం.

ఇతర శాఖలతో చిన్న చిన్న సమస్యలు తప్ప పెద్ద ఇబ్బందులు లేవు. జీహెచ్ఎంసీ పెద్ద ఆర్గనైజేషన్.. మేము ఎవరిపై పెత్తనం చెలాయించట్లేదు. మా అందరికీ బాస్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉన్నారు. మా శాంక్షన్ అయిన బడ్జెట్‌లో 3 నెలలది మాత్రమే రిలీజ్ అయింది. హైడ్రా పోలీస్ స్టేషన్‌లో త్వరలో కేసులు నమోదు చేస్తాం. సున్నం చెరువులో పనులు ఆపమని కోర్టు నుంచి ఎలాంటి ఆర్డర్ రాలేదు. బతుకమ్మ కుంట పనులు పూర్తి కావొస్తున్నాయి. త్వరలో సీఎం ఆధ్వర్యంలో బతుకమ్మ కుంట ప్రారంభిస్తాం. ఈసారి బతుకమ్మ పండుగ అక్కడే నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నాం" అని కమిషనర్ తెలిపారు.

## కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ సభ వాయిదా

మొదటిపేజీ తరువాయి

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో సభను వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది. తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపింది. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సహా కర్ణాటక సీఎం సిద్దరామయ్య కూడా హాజరుకావాల్సి ఉంది. కాగా, ఎన్నికలకు ముందు కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్స్ తీసుకొచ్చింది.

## సుప్రీం కోర్టు ప్రాంగణంలో ఫొటోలు, రీల్స్‌పై నిషేధం!



సుప్రీంకోర్టు ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు, రీల్స్ చేయడం, వీడియోలు తీయడంపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధిస్తూ సర్క్యులర్ జారీ చేసింది. సెప్టెంబరు 10న జారీచేసిన ప్రకటనలో మీడియా సిబ్బంది ఇంటర్వ్యూలు, వార్తలకు సంబంధించిన ప్రత్యక్ష ప్రసారాలను కేవలం భద్రతా ప్రమాణాలకు అనుగుణమైన జోన్‌లో మాత్రమే నిర్వహించాలని సుప్రీం కోర్టు పేర్కొంది.

కోర్టు ప్రాంగణంలో అధికారిక వినియోగానికి మినహా, వీడియోగ్రఫీ, రీల్స్ చేయడానికి, ఫొటోలు తీయడం కోసం ఉపయోగించే ఫోన్స్, కెమెరా, ట్రైపాడ్, సెల్ఫీ స్టిక్ వంటి పరికరాలను న్యాయస్థానం నిషేధించింది.

"ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించిన వారిపై బార్ అసోసియేషన్ లేదా రాష్ట్ర బార్ కౌన్సిల్ తగిన చర్యలు తీసుకోవాలి. మీడియా సిబ్బంది, నిబంధనలను అతిక్రమిస్తే ఆ మీడియాకి నెల పాటు ప్రాంగణంలోకి అడుగు పెట్టకుండా ఆదేశాలు ఇవ్వవచ్చు. కోర్టు సిబ్బంది లేదా రిజిస్ట్రీ, సంబంధిత ఉన్నత అధికారులు ఉల్లంఘనలకు పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తూ.. వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం" అని సర్క్యులర్‌లో పేర్కొంది.

హై సెక్యూరిటీ జోన్‌లో సిబ్బంది, న్యాయవాదులు లేదా ఇతరులు ఫొటోలు లేదా వీడియోలు తీయకుండా నిరోధించే హక్కు భద్రతా సిబ్బందికి ఉంటుందని జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది.

### ఏపీ మద్యం కేసు.. సంగారెడ్డి జిల్లాలో సిట్ సోదాలు




సంగారెడ్డి: ఏపీ మద్యం కేసుకు సంబంధించి తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో సిట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేటలోని గ్రీన్‌టెక్ ఇంజినీరింగ్ సిస్టమ్‌లో 9 మంది సభ్యులతో కూడిన సిట్ బృందం సోదాలు చేపట్టింది. సంస్థ యజమాని సందీప్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. లిక్కర్ స్కామ్‌కు సంబంధించి హైదరాబాద్, విశాఖలోని నర్రెడ్డి సునీల్ కుమార్‌రెడ్డికి చెందిన 10 కంపెనీల్లో సిట్ అధికారులు నిన్న సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే.

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ప్రమాణం

మొదటిపేజీ తరువాయి

ఆ సమయంలో ఆయన రాష్ట్రంలో 93 రోజుల పాటు 19 వేల కి.మీ రథయాత్ర నిర్వహించారు. 2024, జూలై 31న ఆయన మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు జార్ఖండ్ గవర్నర్‌గా ఏడాదిన్నర పాటు చేశారు. తెలంగాణ ఇన్‌చార్జి గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ పనిచేశారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఆయన రెండుసార్లు ఎంపీగా చేశారు. అభిమానులు ఆయనను తమిళనాడు మోదీగా పిలుస్తారు.

## బొగ్గు బ్లాక్‌లు దక్కకపోవడంతో సింగరేణి ఇబ్బందులు ఎదుర్కొంటోంది

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సింగరేణి సంస్థ కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా ఇతర ఖనిజాల వైపు కూడా మళ్లుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సింగరేణి మారుతోంది. ఈ సంస్థ కేవలం ఉపాధికే పరిమితం కాకుండా స్థానికులకు ఒక నమ్మకం కలిగిస్తోంది. సింగరేణి సంస్థకు అదనంగా రావాల్సిన బొగ్గు బ్లాకులు దక్కకపోవడం, కొత్త బ్లాకులు కేటాయించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కర్ణాటకలోని రాయచూర్, దేవదుర్గ్ బెల్ట్‌లో రాగి, బంగారం ఖనిజాల అన్వేషణలో సింగరేణి పాల్గొంది.

రాగి, బంగారం మైనింగ్‌ను ఏ సంస్థ చేసినా సింగరేణికి 37.75శాతం రాయల్టీ వస్తుంది. కీలక ఖనిజాల వెలికితీతలో కూడా కేంద్రం సింగరేణి సంస్థకు అవకాశం కల్పించాలి. గ్రీన్ ఎనర్జీలో కూడా ఈ సంస్థ ప్రవేశించింది. పలు రాష్ట్రాల్లోని ఎన్టీపీసీలకు సింగరేణి బొగ్గు సరఫరా చేస్తోంది. మన రాష్ట్రంలో మరో 25 ఏళ్లకు సరిపడా మాత్రమే బొగ్గు నిల్వలు ఉన్నాయి. సింగరేణి సంస్థ వేలంలో పాల్గొనకపోతే బొగ్గు బ్లాక్‌లు ప్రైవేటు వ్యక్తులకు వెళ్తాయి. సత్తుపల్లి, కోయగూడెం బ్లాక్‌లు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తులకు వెళ్లాయి" అని భట్టి విక్రమార్క వివరించారు.

## బాసర టు భద్రాచలం టెంపుల్ సెంట్రిక్ ఘాట్స్: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి

పుష్కరాల సమయంలో దాదాపు రెండు లక్షల మంది ఒకే సారి స్నానాలు ఆచరించేందుకు వీలుగా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి ఆలయానికి స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు డిజైన్లలో ఘాట్లు నిర్మించాలని అన్నారు. ఇందు కోసం పర్యాటక శాఖతో పాటు నీటిపారుదల, దేవాదాయశాఖలు కలిసి సమన్వయంతో పనిచేయాలని అన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మూడు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పరీక్షల సన్నద్ధతలో ఉండండి..

మొదటిపేజీ తరువాయి

సిద్దిపేట: నిరుద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక సూచన చేశారు. నిరుద్యోగులు ఆందోళన చెందొద్దని.. త్వరలోనే జాబ్ క్యాలెండర్ వస్తుందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాల ప్రక్రియ వెంట వెంటనే పూర్తి చేస్తామని.. నిరుద్యోగులంతా పరీక్షల సన్నద్ధతలో ఉండాలని సూచించారు. శుక్రవారం (సెప్టెంబర్ 12) సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును సందర్శించిన మంత్రి పొన్నం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తెలంగాణ పోరాటానికి మూలమైన నీళ్లు, నిధులు, నియామకాల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాలకు సంబంధించి గత ప్రభుత్వం తీసుకున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదమై పెండింగ్?లో ఉన్నప్పటికీ వాటినన్నింటిని పరిష్కరించి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే దాదాపు 65 వేల ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణ విషయంలో కొన్ని లోపాలున్నాయనే కారణంతో కోర్టు ఒక తీర్పు ఇచ్చిందని.. కోర్టు నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలన్నారు.

కానీ కోర్టు తీర్పును ఆసరాగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీ మొత్తం పరీక్షనే రద్దు చేయాలని కోరుతూ రాక్షానందం పొందుతున్నారని.. ఇది దురదృష్టకరమన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలబడి, వారికి అండగా ఉండి బాధ్యతగల ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తే మంచిదని సూచించారు. ఎక్కడైనా న్యాయపరమైన చిక్కులు ఉంటే వాటిని అధిగమించి ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందని తెలిపారు.

## ఈనెల 15 నుంచి తెలంగాణలో వృత్తి విద్యా కళాశాలల నిరవధిక బంద్

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయకపోతే ఈనెల




15 నుంచి కళాశాలలను నిరవధికంగా బంద్ చేయనున్నట్టు తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ప్రకటించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని కలిసిన సమాఖ్య సభ్యులు పీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు బంద్ కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి రోజును ఇంజినీర్స్ డేగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆ రోజును బ్లాక్ డేగా ప్రకటిస్తూ ఇంజినీరింగ్, ఫార్మా, నర్సింగ్, ఎంబీఏ, ఎంసీఏ సహా వృత్తి విద్యా కళాశాలలు బంద్ నిర్వహిస్తాయని తెలిపారు. డిగ్రీ, పీజీ కాలేజీలు 16వ తేదీ బంద్ చేపటట్టనున్నట్టు ప్రకటించాయి. రూ.10వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకాయిలు ఉన్నాయని, వాటిలో ఇప్పటికే టోకెన్లు విడుదల చేసిన రూ.1200కోట్లు అయినా ఈనెల 30వ తేదీ నాటికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలలు బంద్ కొనసాగిస్తే దాదాపు పది లక్షల మంది విద్యార్థులపై ప్రభావం పడే అవకాశం ఉంది. దీంతో ఉన్నత విద్యా మండలి, ప్రభుత్వం తక్షణం బకాయిలను విడుదల చేయాలని కళాశాలల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి.

## వాదం పరివ్యాప్తం కావాలి

**- వేద బ్రాహ్మణులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుంది.. హరీష్ రావు**



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు వేద బ్రాహ్మణులకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. శుక్రవారం తూంకుంట మున్సిపల్ కేంద్రంలోని తెలంగాణ వేద శాస్త్ర ప్రవర్ధక సభ ఆధ్వర్యంలో రామభద్ర క్షేత్రంలో 9వ చతుర్వేద సదస్సు ఘనంగా జరిగింది.
ఈ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన వేద విద్యార్థులకు పట్టాలను అందజేశారు. హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, మాట్లాడారు.
వాదం పునః విశ్వ పరివ్యాప్తం కావాలని హరీష్ రావ్ ఆకాంక్షించారు.

## నకిలీ ఐటీసీ స్కాంపై కొనసాగుతున్న ఈడీ సోదాలు




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలతో పాటు తెలంగాణ సహా 5 రాష్ట్రాల్లో నకిలీ ఐటీసీ స్కాంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు నిర్వహిస్తోంది. ఏకకాలంలో 10 చోట్ల జరుగుతున్న ఈ దాడుల్లో, షెల్ కంపెనీల ఖాతాల ద్వారా రూ.650 కోట్ల మేర నగదు బదిలీ అయినట్లు ఈడీ గుర్తించింది. నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా కోట్లలో వ్యాపారం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మే నెలలో అరెస్ట్ అయిన శివకుమార్ ఈ స్కాం ప్రధాన లబ్ధిదారుడని ఈడీ అధికారులు తెలిపారు. మరికొంతమంది వ్యక్తులు, సంస్థలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

## రైతులను మోసం చేసిన బిజెపి ఎంపీ అరవింద్ పై కాంగ్రెస్ ఫైర్



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ డెలిగెట్ కల్వకుంట్ల సుజిత్ రావు ఆదేశాల మేరకు, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అధ్యక్షతన రాష్ట్ర కిసాన్ సెల్ జాయింట్ కోఆర్డినేటర్ సత్యం రెడ్డి తన కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిన్న జరిగిన బీజేపీ మీడియా సమావేశంలో మాట్లాడిన అరవింద్ అనుచరుల మాటలన్నీ వట్టి మాటలేనని, మొదటిసారి ఎంపీగా గెలిస్తే షుగర్ ఫ్యాక్టరీ కట్టిస్తానని అన్న ధర్మపురి అరవింద్ ఎక్కడ అని ప్రశ్నించారు. తిరిగి మరోమారు ఎన్నికల స్టంట్ గా షుగర్ ఫ్యాక్టరీ తెరపైకి తెచ్చి రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అరవింద్ షుగర్ ఫ్యాక్టరీ పట్టించుకోలేదని అన్నారు.

## బిజెపి సేవాపక్షం కార్యశాల

**- బూత్ స్థాయిలో సేవా కార్యక్రమాలకు పిలుపు**



**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
కథలాపూర్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షుడు మల్యాల మారుతి అధ్యక్షతన సేవాపక్షం మండల కార్యశాల నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు బూత్ స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాపక్షం ఇన్చార్జ్ లింగంపల్లి శంకర్, గోపాల్ రెడ్డి, గాంధారి శ్రీనివాస్, మహేష్, శ్రీకర్, ప్రమోద్ పాల్గొన్నారు.

## యామాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతులు

**- నేడు మూడు గంటల పాటు సరఫరా నిలిపివేత**



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9:00 గంటల నుండి 12:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఇబ్రహీంపట్నం ఏఈ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## విద్యుత్ ఉద్యోగికి అండగా నిలవాలి

**- జువ్వాడి నర్సింగరావు**



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
పల్లి పట్టణంలో ఇటీవల విద్యుత్ శాఖ తాత్కాలిక ఉద్యోగి సాంబారి హరీష్ స్తంభంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కరీంనగర్ రేణి హాస్పిటల్లో రెండు నెలల పాటు చికిత్స పొందిన ఆయనను కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జి జువ్వడి నర్సింగరావు పరామర్శించారు. హరీష్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన నర్సింగరావు, విద్యుత్ శాఖ ఉన్నత అధికారులు హరీష్ కుటుంబాన్ని ఆదుకోవాలని, అతని భార్యకు వెంటనే ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ దృష్టికి కూడా తీసుకెళ్తానని అన్నారు. హరీష్ విధులు పూర్తయిన తర్వాత అక్కడి ఏఈ, సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ తీసుకెళ్లి పని చేయించడం తప్పని వాఖ్యానించారు.

## దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ పురపాలక సంఘ పరిధిలోని 20వ వార్డులో ఫ్రైడే డ్రై డే సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ ఆధ్వర్యంలో ప్రజల ఇంటింటికి వెళ్లి, నిల్వ ఉన్న నీటి కుండీలను ఖాళీ చేయించి, బోర్ల పెట్టించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉంటే దోమల లార్వా తయారై వ్యాప్తి చెందుతుందని, అందువల్ల నీటి నిల్వలను తొలగించాలని కమిషనర్ సూచించారు. వార్డులలో తిరిగినప్పుడు నీరు నిల్వ ఉన్న కుండీలలో లార్వా వ్యాప్తి చెందుతున్నట్లు గమనించినట్లు ఆయన తెలిపారు.

## మరో ఎన్‌కౌంటర్

**- ఇద్దరు మావోయిస్టులు మృతి**



**కరపత్రం హైద్రాబాద్**
ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. శుక్రవారం ఉదయం నక్సలైట్లు ఉన్నారనే సమాచారం మేరకు సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఘటనా స్థలం నుంచి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో మరణించిన నక్సలైట్ల సంఖ్య 243కు చేరుకుంది.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన టిపిసిసి అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత



**వకరపత్రం ప్రతినిధి ఏనుగోడు సెప్టెంబరు 12**
శుక్రవారం రోజున టిపిసిసి అధికార ప్రతినిధి పున్న కైలాస్ నేత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు, అనంతరం ఈ సందర్భంగా మాట్లాడుతూ, కామారెడ్డిలో జరగబోవు బీసీ గర్జనలో బలహీన వర్గాలకు తగు న్యాయం చేయడానికి ముఖ్య ఉద్దేశమని అన్నారు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు, రాబోవు స్థానిక సంస్థల ఎలక్షన్లలో కష్టపడ్డ వారికి తగు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

## ఎంపీ రఘునందన్ రావుకు వినతిపత్రం అందజేసిన రేషన్ డీలర్లు

**కరపత్రం ప్రతినిధి గజ్వేల్ సెప్టెంబర్ 12**
గత ఐదు నెలలుగా రేషన్ డీలర్ల కమిషన్ పెండింగ్ లో ఉందని కేంద్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ను సిద్దిపేట జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. శుక్రవారం గజ్వేల్ లో ఆయనను కలిసి కమిషన్ విడుదల కోసం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ తో రేషన్ డీలర్లు మాట్లాడుతూ రేషన్ డీలర్ల పై ప్రభుత్వాలు మొండి వైఖరి చూపిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర వాటా, కేంద్రం వాటా, అంటూ రేషన్ డీలర్ల బ్రతుకులతో చెలగాటమాడుతున్నాయని పేర్కొన్నారు. రాబోయే పది రోజుల్లో బతుకమ్మ, దసరా, దీపావళి, పెద్ద పండుగలు రాబోతున్నాయని గుర్తుకు చేశారు. రేషన్ డీలర్లకు కమిషన్ విడుదల చేస్తే పండగలు జరుపుకునే పరిస్థితి ఉంటుందని, లేకుంటే పస్తువులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ విడుదల చేసిన, రూమ్ రెంట్, హమాలీ డబ్బులు, గుమస్తాకిచ్చే స్తోమత లేక షాపులు నడిపే పరిస్థితి లేకుండా పోయిందని వివరించారు. పిల్లలు ఉన్నత స్థాయిలో చదువుకునేందుకు ఫీజులు కట్టే పరిస్థితి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రేషన్ డీలర్ సమస్యలు విన్న ఎంపీ మాధవనేని రఘునందన్ రావు డీలర్ల సమక్షంలో సివిల్ సప్లై కమిషనర్ కు ఫోన్ చేసి వెంటనే కమిషన్ విడుదల చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీకి రేషన్ డీలర్ల జిల్లా తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంగరి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అజీజ్, కోశాధికారి జూలూరు నాగభూషణం,బొజ్జ నరేందర్, లక్ష్మారెడ్డి,కాటుకం మొనయ్య,నర్సింహారావు, జిల్లా, నియోజకవర్గం రేషన్ డీలర్ల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతాప్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎంపీటీసీ



**గజ్వేల్ సెప్టెంబర్ 12, కరపత్రం ప్రతినిధి**
మాజీ చైర్మన్ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వంటేరు ప్రతాపరెడ్డిని. జాలిగామా మాజీ సర్పంచ్ & మాజీ ఎంపిటిసి తాళ్ల ఆంజనేయులు గౌడ్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చేతి రెడ్డి వెంకట్రాంరెడ్డి లోక్నాథ్ రెడ్డి అలీ రాజుపేట తో కలిసి పరామర్శించారు ప్రతాపరెడ్డి తల్లి వజ్రమ్మ మరణించిన విషయం తెలుసుకొని శుక్రవారం నాడు జగదేపూర్ మండలంలోని దౌలాపూర్ లో లో వంటేరు వజ్రమ్మ చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులు అర్పించారు

## సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం కృషి చేయాలి



**గట్టుప్పల సెప్టెంబర్.12.కరపత్రం ప్రతినిధి**
భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రధమ పాత్ర పోషించిన వ్యక్తి కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సిపిఎం గట్టుప్పల కార్యదర్శివర్గ సభ్యులు కర్నాటి సుధాకర్ అన్నారు . శుక్రవారం సిపిఎం జాతీయ మాజీ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని సిపిఎం మండల కేంద్రం లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కమ్యూనిస్టు కార్యకర్త సీతారాం ఏచూరి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు .దక్షణాది రాష్ట్రాలలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేసిన నాయకుడిగా ఢిల్లీ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ ఉద్యమంలో గొప్ప నాయకుడిగా ఆల్ ఇండియా కార్యదర్శిగా పనిచేసినారు అని తెలిపారు. సిపిఎం ఆల్ ఇండియా కార్యదర్శిగా పనిచేస్తూ వారు మరణించడం జరిగిందని తను విద్యార్థి దశ నుండే పీడిత ప్రజలని ఏకం చేయడం కోసం , శ్రామిక వర్గాల కోసం అహర్నిశలు పోరాటాలు చేసినటువంటి వ్యక్తి అని అన్నారు . ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టులని ఏకం చేయడం కోసం కృషి చేసిన వ్యక్తి తెలుగు రాష్ట్రాల్లో పుట్టి ప్రపంచ దేశాల కమ్యూనిస్టులను ఏకం చేయడం కోసం కృషి చేసినటువంటి వ్యక్తి అలాంటి గొప్ప వ్యక్తి మన మధ్య లేకపోవడం పార్టీకి తీరని లోటుని వారి ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు టేకుమట్ల కృష్ణ , కర్నాటి వెంకటేశం, పెద్దగాని నరసింహ, రైతు సంఘం మండల అధ్యక్షుడు ముసుకు బుచ్చిరెడ్డి, సిపిఎం సీనియర్ నాయకులు ఎండి రబ్బాని, కర్నాటి యాదయ్య, పసుపుల చెన్నయ్య, బొబ్బల చంద్రయ్య, ఖమ్మం నరసింహ, మస్నం మల్లయ్య , తదితరులు పాల్గొన్నారు

## నంగునూరి సత్యనారాయణ ఇంట్లో తేనేటి విందులో పాల్గొన్న రఘునందన్ రావు



**గజ్వేల్ సెప్టెంబర్ 12 కరపత్రం ప్రతినిధి**
నంగునూరి సత్యనారాయణ సేవలు అభినందనీయమని ఎంపీ రఘునందన్ రావు అన్నారు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మాజీ ఉపసర్పంచ్ నంగునూరు సత్యనారాయణ ఇంట్లో తేనీటి విందులో పాల్గొన్న ఎంపీ రఘు నందన్ రావు, ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఉపసర్పంచ్ నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఐ కేర్ వారి సౌజన్యంతో ఇటీవల అవార్డు వచ్చిన సందర్భంగా అలాగే, ప్రజాబంధు అవార్డు స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకొని నన్ను అభినందించడానికి వచ్చిన ఎంపీ రఘునందన్ రావుకు బిజెపి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు, ఎంపీ రఘునందన్ రావు నంగునూరి సత్యనారాయణ ఇంటికి వస్తారని సమాచారం తెలుసుకున్న పలువురు ఆర్యవైశ్య నాయకులు రఘునందన్ రావు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు వెంకట రమణ, నందన్ గౌడ్,మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, అశోక్ గౌడ్, మనోహర్ యాదవ్, బిజెపి నేతలు ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భగత్‌సింగ్ నగర్ వైకుంఠధామం మోడల్ గ్రేవ్‌యార్డ్‌గా రూపుదిద్దుకోనుంది

**- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 కరపత్రం ప్రతినిధి**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని భగత్‌సింగ్ నగర్ స్మశానవాటికను ఆధునిక సౌకర్యాలతో మోడల్ గ్రేవ్‌యార్డ్‌గా తీర్చిదిద్దనున్నట్టు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ప్రకటించారు. చింతల్ డివిజన్‌కు చెందిన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశమై స్మశానవాటికలో తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలను వివరించారు. చెట్ల పొదల తొలగింపు, నీటి సౌకర్యం, స్నానాల గదులు, దహన వాటిక, స్టోర్ రూమ్, వాచ్‌మెన్ రూమ్, వాహనాల పార్కింగ్, గ్యాలరీ వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ, “కుత్బుల్లాపూర్ పరిధిలో ఇప్పటికే పలు వైకుంఠధామాలను కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశాం అన్నారు. అదే తరహాలో భగత్‌సింగ్ నగర్ స్మశానవాటికను ఆధునిక వసతులతో త్వరలో ప్రజల వినియోగానికి అందుబాటులోకి తెస్తాం” అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దేగ కృష్ణమూర్తి, చింతల్, చంద్రానగర్, భగత్‌సింగ్ నగర్, దుర్గయ్య నగర్, రంగా నగర్, స్టార్ లైట్ అపార్ట్‌మెంట్స్, స్ఫూర్తి నగర్, ఆదర్శ నగర్, వైఎంఎస్ కాలనీ, సాయి కాలనీ, శివా నగర్ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం సెప్టెంబర్ 13 2025

## రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ



**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
ఈరోజుమెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని ఆవంచ రైతు వేదికలో రైతులకు యూరియా సరఫరా చేయడం జరిగింది.ఒకటి రెండు చోట్లలో యూరియా పంపిణీ జరగడం వల్ల రద్దీ ఎక్కువగా అయ్యి రైతులు ఎక్కువసేపు క్యూలో నిల్చోవడం జరుగుతున్న కారణంగా జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు ఈరోజు ఆవంచ రైతు వేదికలో యూరియా పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి దీపిక, ఏ ఈ ఓ రుతు, ఏటీఎం హరిష్ మరియు పి ఎ సి ఎస్ అధికారులు రైతులు పాల్గొన్నారు. తక్కువ సమయంలో వచ్చిన రైతులకు యూరియా అందించినందుకు గాను రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో అందరూ రావడం వల్ల రద్దీ ఎక్కువ అయ్యి ఇబ్బంది పడ్డామని. ఈ విధంగా రైతు వేదికలో పంపిణీ చేయడం వల్ల తమ సమయం కూడా వృధా అవ్వకుండా మా ఊరికి దగ్గర్లో ఇవ్వడం వల్ల రవాణా ఖర్చులు కూడా తగ్గుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

## అల్ఫోర్స్ టైనిటాట్స్ విద్యార్థులు ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 12**
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించినటువంటి ఎస్ జి ఎఫ్ అర్బన్ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలలో పాఠశాలకు చెందినటువంటి విద్యార్థులు ఘనవిజయాలు సాధించారని తెలిపారు.



సిహెచ్ శ్రేయన్స్ వర్మ -9వ తరగతి, అండర్ 14 విభాగంలో 600 & 400 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, పి.ఆరాధ్య -8వ తరగతి, అండర్ -14 బాలికల విభాగంలో, షాట్ పుట్ లో రజత పతకం , ఎస్ వైష్ణిక - 10వ తరగతి, అండర్ 17 ట్రిపుల్ జంప్ విభాగంలో రజత పతకం సాధించడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు సైతం ఎంపికైనారని సంతోషం వ్యక్తం చేస్తూ విజేతలకు పుష్పగుచాలతో పాటు అర్హత పత్రాలను అందజేసి రాష్ట్రస్థాయిలోనూ ఈ స్ఫూర్తిని కొనసాగించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, న్యాయమ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల దుష్ప్రభావంపై విద్యార్థులకు అవగాహన




**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వర స్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం మారకద్రవ్యాల వల్ల కలిగే ధూష్ప్రభావలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిల్లల వైద్య నిపుణులు జి. సురేందర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం ద్వారా శరీర ఆరోగ్యం దెబ్బతినడం, రక్తపోటు, గుండె జబ్బులు, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలు రావడం, మెదడు పనితీరు తగ్గిపోవడం, ఏకాగ్రత తగ్గిపోవడం, మానసిక ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, భ్రాంతులు చదువులో, ఉద్యోగంలో వెనుకబడిపోవడం లాంటివి సమస్యలు వస్తాయని వాటికి విద్యార్థులు పూర్తి దూరంగా వుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ పి. ప్రభాకరాచారి, టి. శ్రావణ్ రావు, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్, ఎ. సంతోష్ కుమార్ హార్ట్ ఫుల్ నెస్ కో-ఆర్డినేటర్, శాఖాదీపతులు, ఉపన్యాసకలు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## కర్నాటకలో మళ్లీ కులగణన

**కరపత్రం ప్రతినిధి బెంగళూరు,సెప్టెంబర్12**
రాష్ట్రంలో మళ్లీ కొత్తగా కులగణన చేపట్టనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గతంలో ఇచ్చిన నివేదికను అంగీకరించబోమని.. సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 7 మధ్య మళ్లీ కులగణన చేపడతామని వెల్లడించారు. గతంలో చేపట్టిన కులగణన సమాచారం దాదాపు పదేళ్ల కిందటిది గనక ప్రస్తుతం సమాజంలోని వాస్తవాలను తెలుసుకోవడానికి కొత్తగా సర్వే అవసరమని ఆయన అన్నారు. సమాజంలో అనేక కులమతాలతో పాటు-సామాజిక అసమానతలు కూడా ఉన్నాయి. దేశంలోని ప్రజలంతా సమానమేనని.. ప్రజలందరికీ సమాన సామాజిక న్యాయం జరగాలని రాజ్యాంగం చెబుతోంది. దాని ప్రకారమే.. ప్రజల మధ్య అసమానతలను తొలగించి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు సృష్టించే దిశగా ముందడుగు వేయడానికి మేము నిర్వహించే నూతన సర్వే ఉపయోగపడుతుందని సిద్ధరామయ్య తెలిపారు. 2015లో కర్ణాటక వెనకబడినవర్గాల కమిషన్ జస్టిస్ కాంతరాజ నేతృత్వంలో కులగణన చేపట్టగా, ఈ డేటా ఆధారంగా కె.జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలో పూర్తిస్థాయి నివేదిక తయారుచేసి గతేడాది సర్కారుకు సమర్పించిన విషయం తెలిసిందే. కులగణన, ఆర్థిక, సామాజిక సమీక్షపై రూపొందించిన ఈ నివేదికను కర్ణాటక సర్కారు గతంలోనే ఆమోదించింది. నిపుణులు రూపొందించిన ఈ నివేదికపై భిన్నాభిప్రాయాలు, పలు వర్గాల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతో రాష్ట్రంలో మరోసారి కులగణన చేపట్టనున్నట్లు- ప్రకటన వెలువడింది.

# ఇందిరమ్మ ఇళ్లు పథకం కోసం కాల్ సెంటర్

- మరింత పారదర్శకంగా అమలు
- ఒక్క కాల్‌తో... ఫిర్యాదు

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
**మెదక్ జిల్లాకౌడిపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణ పురోగతిని పరిశీలించిన కలెక్టర్**
**-జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**
ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు అలాగె లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని శుక్రవారం లిజిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు
శుక్రవారం కలెక్టర్ కౌడిపల్లి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ నిర్మాణ పురోగతిని పరిశీలించి వడివడిగా నిర్మాణాల జరగాలని అధికారులను ఆదేశించారు.
పేదవారి సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందేనని. దీనిలో భాగంగా నిర్మాణలకు సంబందించి దశలవారిగా లబ్ధిదారులకు మొత్తం



రూ.5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తుందన్నారు.

ఈ క్రమంలో...
ఇల్లు నిర్మాణం సమయంలో పలు అంశాలకు సంబంధించి లబ్ధిదారుల్లో అనేక అనుమానాలు వస్తున్నాయని... వీటికి సరైన సమాధానాలు చెప్పేందుకు.... ప్రభుత్వం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు
హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారని.. రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించారన్నారు
దీనికి 1800 599 5991 టోల్ ఫ్రీ నంబర్‌ను కేటాయించారని...... ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేసే ఈ కాల్ సెంటర్ కి . లబ్ధిదారులు, సామాన్య ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను సిబ్బంది తెలుసుకుని.. వాటిని నోట్ చేసుకుని సంబంధిత అధికారులకు పంపి.. పరిష్కారం అయ్యేలా చూస్తారన్నారు .
అంతే కాకుండా లబ్ధిదారులే నేరుగా వెబ్ సైట్ లో వారి ఇంటి నిర్మణాలకు సంబందించిన ఫోటో లను అప్ లోడ్ చేసుకునే అవకాశాన్ని అలాగే వారి వివరాలను సమర్పిస్తే బిల్స్ స్టేటస్ ను తెలుసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించచదన్నారు
అర్హులైన లబ్ధిదారులు వారి సొంత ఇంటి కల ను నెరవేర్చుకునే క్రమం లో ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మొదటి నుండి ప్రభుత్వం అనేక రకాలుగా చర్యలు తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేస్తుందని...కలెక్టర్ తెలిపారు


# కరీంనగర్ లో ఈ నెల 14 న జరుగబోవు బీసీ మేధావుల మీటింగ్ జయప్రదం చేద్దాం

- బీసీల జపం చేస్తున్నఅగ్రవర్ణ రాజకీయ పార్టీల మాటలు నమ్మి మోసపోవద్దు
- జక్కే వీరస్వామిగౌడ్ పిలుపు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 12**
ఈ నెల 14 వ తేదీన కరీంనగర్ లోని పద్మశాలి భవన్ లో బీసీ ఇంటలక్చువల్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరుగబోవు బీసీ మేధావుల సభను విజయవంతం చేయాలని సర్వాయిపాపన్న మోకుదెబ్బ గౌడ సంఘము రాష్ట వ్యవస్థాపక అధ్యక్షులు జక్కే వీరస్వామిగౌడ్ పిలుపునిచ్చారు.జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతు ఇప్పుడున్న ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్ బీజేపీ బిఆర్ఎస్ పార్టీలు అధికారం కోసం కొంగ జపాలు చేస్తున్నాయని ఈ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాల్లో అన్యాయం చేసిన పార్టీలే అని వీరస్వామిగౌడ్ మండి పడ్డారు.బీసీ మేధావులైన రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ అలాగే ఇంకా చాలా మంది బీసీ మేధావులు కరీంనగర్ ఉమ్మడి జిల్లా బి సి ఐ ఎఫ్ ఆధ్వర్యంలో జరగనున్న సమావేశానికి హాజరై రిజర్వేషన్ల సాధన ప్రభుత్వ పాలనలో బీసీల వాట అనే



అంశం పై దశ నిర్దేశం చేయనున్నారని ఈ యొక్క సభకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని బీసీ కుల సంఘాలు ముఖ్య%శీ%గా హుజురాబాద్ నియోజికవర్గం లోని యువత విద్యార్థి నాయకులు బీసీ సోదర సోదరీమణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.
బీసీలలో ఉన్న కొందరు నాయకులు ఈ అగ్రవర్ణ పార్టీలకు వాళ్ళ స్వార్థం కొరకు ఎన్నికలు రాగానే చెంచాలుగా మారి మొత్తం బీసీ సమాజాన్ని తాకట్టు పెట్టి పబ్బం గడుపుతుంటారని అలాంటి వాళ్ళతో జాగ్రత్తగా ఉండాలని మన ఓట్లు మన స్వతంత్ర బీసీలకు వేసి రాజ్యాధికార దిశగా బీసీ సమాజం అడుగులు వేయాలని వీరస్వామిగౌడ్ అన్నారు.కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తా అని దొంగ నాటకాలకు తెరలేపిందని బీజేపీ



మతపరమైన రిజర్వేషన్ తో తొండి నాటకాలు అడుతోందని ముస్లింలలో కొన్ని కులాలు బీసీల లో ఉన్న విషయం తెలిసి మత రాజకీయాలు చేస్తోందని బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలో భాగమే బీజేపీ నాటకం అని అలాగే స్థానిక సంస్థల్లో 34 శాతం ఉన్న రిజర్వేషన్ 23 శాతానికి తగ్గించిన ఘనత గత కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీదని ఇప్పటికైనా బీసీలు ఈ పార్టీల కుట్రలను పసి గట్టాలని లేక పోతే బీసీలు మరోసారి మోసపోయే ప్రమాదం ఉందని అందుకే బీసీలు కులవృత్తుల ద్వారా కులాలు వేరైనా బీసీలమనే విషయాన్ని గుర్తించాలని వీరస్వామిగౌడ్ అన్నారు.ఈ సమావేశంలో వివిధ బీసీ కుల సంఘాల నాయకులు పొన్నం.భిక్షపతి గౌడ్ జే.కిరణ్ గణపతి రాజ్ కే.నారాయణ జక్కే.రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరి ఆశయాలతో ఉద్యమిస్తాం

- సిపిఎం మండల కార్యదర్శి శీలం అశోక్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 12**
జమ్మికుంట మండల కేంద్రంలో సిపిఎం పార్టీ అఖిల భారత జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి వారి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి శీలం అశోక్ మాట్లాడుతూభారతదేశ రాజకీయ రంగంలో మార్క్సిస్ యోధుల్లో ఒకరు ఈయన 19 52 ఆగస్టు 12వ తేదీన మద్రాసు నగరంలో బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి ఉన్నత చదువుల హైదరాబాదులో చదివి విద్యార్థి సంఘం నుండి కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితుడై ఉన్నత పదవులు జాతీయ కార్యదర్శిగా ఎదిగి పేద బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు కృషి చేసినారు. ఆయన ప్రజా ప్రతినిధిగా రాజ్యసభ సభ్యునిగా ఉత్తమ పార్లమెంటన్ గా రాజ్యసభ



సభ్యునిగా ఎన్నికైనారు ఆయన 2024 సెప్టెంబర్ 12వ తేదీన తుది శ్వాస విడిచారు ఉపాధి హామీ చట్టం తీసుకురావడంలో కృషి చేసినటువంటి మహానీయుడు అట్లాగే బీజేపీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి వ్యతిరేక శక్తులన్నింటిని ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఘనత ఏచూరు గారిదే అన్నారు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఇండియా కూటమిని బిజెపి నీ వ్యతిరేకించే పార్టీలను కలుపుకొని ఇండి కూటమిగా రూపొందించడంలో ప్రధాన పాత్ర దారుడు ఆయన చనిపోయిన తర్వాత కూడా ఆయన పార్థివ దేహాన్ని ఎయిమ్స్ కు అప్పగించారు కుటుంబ సభ్యులు ఇలా బడుగు బలహీన వర్గాల కోసం తినలేని సేవలు చేసినటువంటి మహానీయుడు సీతారాం ఏచూరి ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా వ్యతిరేకంగా మాట్లాడినందుకు ఆయనను నిర్బంధించారు ఇలా వారు ఎన్నో బడుగు బలహీన వర్గాల కోసం వెనలేని సేవలను అందించిన పోరాట యోధుడు వారి ఆశయాలను కొనసాగిస్తూ వారి అడుగుజాడల్లో నడుస్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జక్కుల రమేష్, యాదవ్ వడ్లూరి కిషోర్ కుమార్, ఎన్ సుభాష్, ఎన్ మహేందర్,పి రాజేందర్, ఎస్ సారంగపాణి, జి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# దేవుని సొమ్ము కాజేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పై చర్యలు తీసుకోండి

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 12:**
దేవాదాయశాఖ పెద్దపల్లి జిల్లా గోదావరిఖని శ్రీ కోదండరామాలయం అక్రమాలకు, దేవుని సొమ్ము కాజేస్తున్న జూనియర్ అసిస్టెంట్, కార్యనిర్వహణ అధికారిపై చర్యలు తీసుకొని దేవాలయంను సంరక్షించాలని గోదావరిఖని ఎల్.బి.నగర్ కు చెందిన మామిడి కుమారస్వామి కోరారు. ఈ మేరకు శుక్రవారం దేవాదాయ దర్మాదాయశాఖ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. గత 21 సంవత్సరాల నుండి వరుసగా అయ్యప్పదీక్ష స్వీకరిస్తున్నానని, దీనిలో భాగంగా నాదీక్ష కాలంలో నేను నిత్యం శ్రీకోదండరామాలయంలో పూజలు చేస్తున్నానని తెలిపారు. నాదీక్ష కాలం ఆనంతరం కూడ నేను దైవదర్శనం కొరకు నిత్యం వెళ్ళుతాననని, నాపట్ల భక్తులందరి ముందు జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ దూషించడం, దురుసుగా ప్రవర్తిస్తున్నారన్నారు. జూనియర్ అసిస్టెంట్ అయిన సుధాకర్, కార్యనిర్వహణ అధికారి వారి విధులను సక్రమంగా నిర్వహించకుండా వారి ఇరువురు ఒకటై దేవాలయంనకు రావాల్సిన ఆదాయంను అక్రమంగా వారి బ్యాంకు ఖాతాలలో బదిలీ చేసుకొంటున్నారని, అలాగే పండుగలకు, వార్షిక ఉత్సవాలకు దాతల ద్వారా సేకరించిన నిధుల ద్వారా దేవాలయం పనులను చేయించి, వారి చేపించినట్లు చూపి ఆ డబ్బును వారి ఇరువురు తీసుకొనుచున్నారని అన్నారు. జూనియర్ అసిస్టెంట్ అయిన సుధాకర్ భక్తులపై చిన్నచూపు చూస్తు, ఎవ్వరైతే డబ్బులు ఇస్తున్నారో వారికి ప్రత్యేక దర్శనం, గౌరవంగా చూస్తున్నారని, డబ్బులు ఇవ్వని ఇతర భక్తులను చిన్నచూపు చూస్తు దైవదర్శనం చేయకుండ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. శ్రీకోదండరామాలయం జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ కి అడ్డగా మారిందని, వారిని అడ్డుకోవలసిన కార్యనిర్వహణ అధికారి తనకు సహకరిస్తున్నారని, దర్శనం కొరకు వస్తున్న మహిళ భక్తుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వారిని అవమానస్తున్నారని, దీని వలన శ్రీకోదండరామాలయం ప్రతిష్ట, ఆర్థిక లావాదేవీలు రెండు రకాల నష్టం వాటిల్లుతున్నదన్నారు. కావున జూనియర్ అసిస్టెంట్ అయిన సుధాకర్, కార్యనిర్వహణ అధికారి పూర్తి విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకొని, దేవాలయానికి సంబంధించి ఆస్తులను కాపాడాలని కోరారు.